ఐదేండ్లలో అద్భుత ప్రగతి

17వ లోక్‌సభ కాలం 'సంస్కరణ, పనితీరు, పరివర్తన' పీరియడ్

బడ్జెట్ సమావేశాల చివరి రోజు ప్రసంగంలో ప్రధాని మోదీ

శనివారం లోక్‌సభలో మాట్లాడుతున్న ప్రధాని మోదీ

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 10: గత ఐదేండ్ల తమ ప్రభుత్వ పాలనలో అద్భుతమైన ప్రగతి సాధించామని ప్రధాని మోదీ పేర్కొన్నారు. 17వ లోక్‌సభ ఐదేండ్ల కాలవ్యవధిని సంస్కరణ, పనితీరు, పరివర్తన(రీఫార్మ్, పెర్ఫార్మ్, ట్రాన్స్‌ఫార్మ్) పీరియడ్‌గా చెప్పవచ్చని, దేశం వేగంగా 'పెద్ద మార్పుల' దిశగా పయనిస్తున్నదని అన్నారు. బడ్జెట్ సమావేశాల చివరి రోజు సందర్భంగా మోదీ శనివారం లోక్‌సభలో మాట్లాడారు. గత ఐదేండ్లలో దేశ దిశను మార్చే పలు కీలకమైన సంస్కరణలు చేపట్టామని, ఇవి 21వ శతాబ్దంలో దేశానికి బలమైన పునాది వేశాయన్నారు. 17వ లోక్‌సభలో తమ ప్రభుత్వం పలు ముఖ్యమైన నిర్ణయాలు తీసుకొన్నదని పేర్కొన్నారు. దేశానికి ఒకే రాజ్యాంగం ఉండాలని ప్రజలు ఎన్నో తరాలుగా కన్న కలలను తమ ప్రభుత్వం నెరవేర్చిందని పేర్కొన్న మోదీ.. ఈ సందర్భంగా జమ్ముకశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తి కల్పించే ఆర్టికల్ 370 రద్దును ప్రస్తావించారు. ఈ ఐదేండ్లలో ఎదురైన కొవిడ్ వంటి పలు సవాళ్లను సమర్థవంతంగా ఎదుర్కొన్నామని, దేశానికి సరైన దిశ ఇచ్చామని మోదీ చెప్పుకొచ్చారు. సభను నిష్పక్షపాతంగా, సమర్థవంతంగా నడిపించారని పేర్కొంటూ స్పీకర్ ఓంబిర్లాను మోదీ ప్రశంసించారు. కొత్త పార్లమెంట్ భవన నిర్మాణం కలను కూడా ఈ పీరియడ్‌లోనే నెరవేర్చుకొన్నామన్నారు. చరిత్రాత్మక మహిళా రిజర్వేషన్ బిల్లు, ట్రిపుల్ తలాక్ బిల్లుల ఆమోదాన్ని కూడా ఈ సందర్భంగా ప్రస్తావించారు.

ఆర్థిక ప్రగతి నాశనంలో ఆరితేరారు:నిర్మల

గత ప్రభుత్వాలు సాధించిన ప్రగతిని నాశనం చేయటంలో కాంగ్రెస్ పార్టీ ఆరితేరిందని, స్వార్థ రాజకీయ కోసం యూపీఏ ప్రభుత్వం దేశాన్ని ఆర్థికంగా దయనీయ స్థితికి తీసుకొచ్చిందని కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ అన్నారు. యూపీఏ హయాంతో పోల్చుతూ మోదీ సర్కార్ విడుదల చేసిన 'శ్వేతపత్రం'పై రాజ్యసభలో శనివారం స్వల్పకాలిక చర్చ జరిగింది. చర్చలో పాల్గొనకుండా కాంగ్రెస్ సభ నుంచి వాకౌట్ చేసింది. ఆర్థికంపై కేంద్రం విడుదల చేసింది శ్వేతపత్రం కాదని, అబద్ధాల పత్రమని కాంగ్రెస్ నాయకుడు చిదంబరం ఎద్దేవా చేశారు. ఎన్డీయే తప్పుల్ని, మోసపూరిత వాగ్దానాల్ని కప్పి పుచ్చుకునేందుకు చేసిన ప్రయత్నంగా ఆయన విమర్శించారు. శ్వేతపత్రంపై సభలో నిర్మలా సీతారామన్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీపై విరుచుకుపడ్డారు. 'వాజ్‌పేయి హయాంలో ద్రవ్యోల్బణం 4 శాతం లోపు ఉంది. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన యూపీఏ 2004-14 మధ్య ఇష్టమున్నట్టుగా వ్యవహరించింది. సోనియాగాంధీ రాజ్యాంగేతర శక్తిగా ఎదిగారు. తప్పుడు లక్ష్యాలతో కూడిన సబ్సిడీలు, నిధుల వ్యయం, నిర్లక్ష్యపు ఆర్థిక విధానం..ఇదంతా కేవలం రాజకీయ ప్రయోజనాల కోసం జరిగింది' అని అన్నారు. వాజ్‌పేయి తర్వాత దేశాన్ని ఆర్థికంగా కాంగ్రెస్ ముందుకు తీసుకెళ్లలేకపోయిందని, ఆర్థికంగా దయనీయంగా మారిన దేశాన్ని 2014లో ప్రస్తుత ఎన్డీయే సర్కార్‌కు వదిలేసిందని ఆమె అన్నారు. సాధించిన ప్రగతిని తుడిచిపెట్టడంలో కాంగ్రెస్ మాస్టర్ డిగ్రీ చేసిందని అన్నారు.

17వ లోక్‌సభలో తక్కువ సిట్టింగ్‌లు

17వ లోక్‌సభ సమావేశాలు శనివారంతో ముగిశాయి. ఐదేండ్ల పూర్తి కాలం ప్రభుత్వం నడిచిన సందర్భాల్లో అతి తక్కువ సార్లు లోక్‌సభ సమావేశమైన పీరియడ్‌గా 2019-24 నిలిచింది. 17వ లోక్‌సభ మొత్తంగా 272 సార్లు సమావేశమైందని మేధో సంస్థ పీఆర్ఎస్ లెజిస్లేటివ్ రిసెర్చ్ గణాంకాలు వెల్లడించాయి. 16, 15, 14వ లోక్‌సభలు వరుసగా 331, 332, 356 సార్లు సమావేశం కాగా.. స్వాతంత్రం వచ్చిన తర్వాత ఏర్పాటైన మొదటి లోక్‌సభ(1952-57) అత్యధికంగా 677 సార్లు సిట్టింగ్‌లు జరిపింది. 2, 3వ లోక్‌సభలు వరుసగా 581, 578 సార్లు సమావేశం అయ్యాయి.

చరణ్ సింగ్‌ను అవమానిస్తున్నారు

కాంగ్రెస్ సభ్యులపై రాజ్యసభ చైర్మన్ ఫైర్

న్యూఢిల్లీ: రాజ్యసభలో కాంగ్రెస్ సభ్యుల వైఖరిపై చైర్మన్ జగదీప్ ధన్‌కర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. చౌదరి చరణ్ సింగ్, ఆయన వారసత్వాన్ని మీరు అవమానిస్తున్నారంటూ కాంగ్రెస్ చీఫ్ మల్లిఖార్జున్ ఖర్గే, జైరామ్ రమేశ్, ఇతర సభ్యులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. చరణ్ సింగ్‌కు భారతరత్న ఇవ్వడంపై శనివారం జరిగిన చర్చలో ప్రతిపక్ష నేత కంటే ముందుగా చరణ్ సింగ్ మనవడు, ఆర్ఎల్డీ అధినేత జయంత్ చౌదరికి మాట్లాడే అవకాశం ఇవ్వడం పట్ల కాంగ్రెస్ అభ్యంతరం వ్యక్తం చేసింది. దీనిపై జగదీప్ ఆగ్రహం వ్యక్తం చేస్తూ గతంలోనే చరణ్ సింగ్‌కు భారతరత్న ఇచ్చేందుకు మీకు (కాంగ్రెస్‌కు) సమయం దొరకలేదని అన్నారు. ఇది దేశ రైతులను అవమానించడమేనని అన్నారు. చరణ్ సింగ్‌ను అవమానిస్తే సహించమని అన్నారు. అనంతరం ఖర్గే మాట్లాడుతూ చరణ్ సింగ్‌కు భారతరత్న ఇవ్వడాన్ని తాము స్వాగతిస్తున్నామని అంటూనే ఏ నిబంధన ప్రకారం జయంత్‌కు తొలుత అవకాశమిచ్చారో చెప్పాలని డిమాండ్ చేశారు.

సిఫార్సుల మాటేంటి: ఎస్‌కేఎం

న్యూఢిల్లీ: రైతుల సంక్షేమానికి విశేష కృషి చేసిన మాజీ ప్రధాని చౌదరీ చరణ్ సింగ్, వ్యవసాయ శాస్త్రవేత్త ఎంఎస్ స్వామినాథన్‌లకు భారతరత్న అవార్డు ప్రకటించడం పట్ల సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కేఎం) హర్షం వ్యక్తం చేసింది. అయితే అదే సమయంలో పంటల కనీస మద్దతు ధరపై స్వామినాథన్ కమిటీ చేసిన సిఫార్సులపై ప్రజల దృష్టిని మళ్లించడానికి కేంద్రం చేసిన ప్రయత్నంగా అవార్డుల ప్రకటనను విమర్శించింది. ఈ మేరకు ఎస్‌కేఎం శనివారం ఒక ప్రకటన విడుదల చేసింది. సంక్షోభంలో ఉన్న రైతుల సమస్యలను తీర్చడానికి నరేంద్ర మోదీ ప్రభుత్వం విఫలమైందని విమర్శించింది. చరణ్ సింగ్, స్వామినాథన్‌లకు భారతరత్న ప్రకటించకపోయినా వారు ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా ఉంటారని పేర్కొంది.

హర్యానాలో మొబైల్ ఇంటర్నెట్ బంద్

రైతుల ఆందోళనపై ఆంక్షలు

చండీగఢ్, ఫిబ్రవరి 10: హర్యానా ప్రభుత్వం మొబైల్ ఇంటర్నెట్, బల్క్ ఎస్ఎంఎస్‌లపై ఆంక్షలు విధించింది. ఈ నెల 13న రైతులు చేపట్టిన 'ఢిల్లీ ఛలో' ఆందోళనను పురస్కరించుకుని శాంతి భద్రతల సమస్య ఏర్పడకుండా ముందు జాగ్రత్త చర్యగా రాష్ట్రంలోని ఏడు జిల్లాల్లో వీటి నిషేధాన్ని అమలు చేయాలని శనివారం ఆదేశాలు జారీ చేసింది. దీని ప్రకారం అంబాల, కురుక్షేత్ర, కైతల్, జింద్, హిసార్, ఫతేహాబాద్, సిర్సా జిల్లాల్లో ఈ నెల 11వ తేదీ ఉదయం 6 నుంచి 13వ తేదీ రాత్రి 11.59 గంటల వరకు మొబైల్ ఇంటర్నెట్, బల్క్ ఎస్ఎంఎస్ సేవలను నిలిపివేస్తారు. కాగా, తమ డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో సుమారు 200 రైతు సంఘాలు ఢిల్లీకి మార్చ్ నిర్వహించనున్నాయి.

అమెరికాలో మరో భారతీయుడి మృతి

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 10: అమెరికాలో భారతీయులపై దాడులు కొనసాగుతూనే ఉన్నాయి. తాజాగా జరిగిన దాడిలో మరొక భారతీయుడు మృతి చెందాడు. ఈ నెల 2న తెల్లవారుజామున వాషింగ్టన్‌లోని ఓ రెస్టారెంట్ నుంచి బయటకు వచ్చిన వివేక్ అనే యువకుడికి ఓ వ్యక్తితో వాగ్వాదం చోటు చేసుకున్నది. ఆ వ్యక్తి తలపై గట్టిగా కొట్టడంతో తీవ్రంగా గాయపడిన వివేక్ అక్కడికక్కడే కుప్పకూలిపోయాడు. అపస్మారక స్థితిలో ఉన్న బాధితుడిని గుర్తించిన పోలీసులు వెంటనే దవాఖానకు తరలించారు. ఈ నెల 7న వివేక్ తుది శ్వాస వదిలాడు. నిందితుడి కోసం పోలీసులు గాలిస్తున్నారు.

న్యూయార్క్ జిల్లా జడ్జిగా భారత సంతతి వ్యక్తి

వాషింగ్టన్, ఫిబ్రవరి 10: అగ్రరాజ్యం అమెరికాలో భారత సంతతికి చెందిన మరో వ్యక్తికి అరుదైన గౌరవం దక్కింది. న్యూయార్క్‌లోని తూర్పు జిల్లా కోర్టు న్యాయమూర్తిగా భారతీయ మూలాలున్న సంకేత్ జయేశ్ బల్సారా నియమితులయ్యారు. ఈ మేరకు వైట్ హౌస్ ప్రకటన విడుదల చేసింది. ఇదే కోర్టులో 2017 నుంచి సంకేత్ జయేశ్ బల్సారా మెజిస్ట్రేట్‌గా పనిచేస్తున్నారు. ఈ పదవిని చేపట్టిన తొలి దక్షిణాసియా వాసిగా బల్సారా నిలిచారు. ఇప్పుడతనికి న్యాయమూర్తిగా పదోన్నతి లభించింది. భారత్, కెన్యాల నుంచి ఐదు దశాబ్దాల క్రితం సంకేత్ జయేశ్ కుటుంబం అమెరికాకు వలస పోయింది. సెక్యూరిటీలు, కాంట్రాక్టులు, దివాల, నియంత్రణ వ్యవహారాల్లో నిపుణుడిగా సంకేత్ జయేశ్‌కు పేరున్నది.

- శ్వేత సోయగాల కశ్మీరం

కొండలు, గుట్టలు.. ఇలా ఎక్కడ చూసినా మంచే కనిపిస్తున్నదేంటి అని ఆశ్చర్యపోతున్నారా.. శనివారం కశ్మీర్‌లోని గండేర్‌బాల్ ప్రాంతంలో కురిసిన మంచుతో ఆ ప్రాంతమంతా శ్వేత సోయగాలను సంతరించుకున్నది.

కాంగ్రెస్ ఎమ్మెల్యే ఇంటిపై ఈడీ దాడి

బెంగళూరు: కర్ణాటక కాంగ్రెస్ ముఖ్య నేతల్లో ఒకరు, బళ్లారి ఎమ్మెల్యే నారా భరత్‌రెడ్డి ఇంటిపై ఈడీ దాడులు చేపట్టింది. కర్ణాటకలోని ఆరు ప్రాంతాల్లో ఏక కాలంలో ఈడీ దాడులు జరిపినట్టు అధికారిక వర్గాలు శనివారం మీడియాకు వెల్లడించాయి. మనీలాండరింగ్ కేసులో ఎమ్మెల్యేపై కర్ణాటక పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. భరత్‌రెడ్డి నివాసం, కార్యాలయంతోపాటు కర్ణాటక, తెలంగాణల్లో ఆయన సన్నిహితుల ఇండ్లలోనూ సోదాలు జరుపుతున్నామని అధికారులు చెప్పారు. బళ్లారి, బెంగళూరులలో ఆయన నివాసాల్లో దర్యాప్తు ఏజెన్సీ అధికారులు సోదాలు నిర్వహించారు. భూ ఒప్పందాలకు సంబంధించి అవకతవకలు జరిగాయన్న ఆరోపణల్లో కర్ణాటక పోలీసులు భరత్‌రెడ్డిపై ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. దీని పైనా, పలు మైనింగ్, క్వారీ సంస్థల వ్యాపారాలతో ఆయనకు సంబంధమున్న ఆరోపణలపైనా ఈడీ విచారణ జరుపుతున్నది. ఈ కేసులో ప్రాథమిక ఆధారాలు లభ్యమైనట్టు ఈడీ అధికారిక వర్గాలను ఊటంకిస్తూ మీడియాలో వార్తలు వెలువడ్డాయి.

బీహార్‌లో కీలక పరిణామం

విశ్వాస పరీక్షకు ముందు ఎన్డీయే నేతతో సీపీఐ(ఎంఎల్) భేటీ

పాట్నా, ఫిబ్రవరి 10: బీహార్‌లో మరో కీలక రాజకీయ పరిణామం చోటు చేసుకుంది. సీఎం నితీశ్ కుమార్ అసెంబ్లీలో విశ్వాస పరీక్షకు ముందు ఇప్పటివరకు మహాఘటబంధన్ భాగస్వామిగా ఉన్న సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ పార్టీ శాసనసభా పక్ష నేత మెహబూబ్ ఆలం శనివారం ఎన్డీయే భాగస్వామి, మాజీ ముఖ్యమంత్రి జితన్ రామ్ మంజీని కలిశారు. విశ్వాస పరీక్షకు 48 గంటల ముందు కలవడంపై ఆయన స్పందిస్తూ ఇందులో రాజకీయమేదీ లేదని చెప్పారు. నలుగురు ఎమ్మెల్యేలు ఉన్న సీపీఐ (ఎంఎల్) నేత ఎన్డీయేకు మద్దతు ఇస్తారని బీహార్‌లో ఊహాగానాలు వస్తున్నాయి. 243 మంది సభ్యులున్న అసెంబ్లీలో ఎన్డీయేకు కావాల్సిన దానికన్నా అరుగురు అధికంగా 128 మంది సభ్యులున్నారు.

రిజర్వేషన్ల కోసం మళ్లీ జరాంగే దీక్ష

ముంబై, ఫిబ్రవరి 10: మహారాష్ట్రలో మరాఠాలకు రిజర్వేషన్లు కల్పించాలంటూ సామాజిక కార్యకర్త మనోజ్ జరాంగే మళ్లీ దీక్షకు దిగారు. శనివారం జల్నా జిల్లాలోని తన స్వగ్రామం అంతర్వాలి-సారతి గ్రామంలో ఆమరణ నిరాహార దీక్షను మొదలుపెట్టారు. 'మరాఠా సామాజిక వర్గానికి రిజర్వేషన్లు అమలు జేసేందుకు రాష్ట్ర అసెంబ్లీ ప్రత్యేకంగా సమావేశమై..చట్టాన్ని చేయాలి.' అని సీఎం ఏక్‌నాథ్ షిండే సర్కార్‌కు అల్టిమేటం జారీ చేశారు. అంతేగాక మరాఠా సామాజికవర్గ సభ్యులపై దాఖలైన పోలీస్ కేసులన్నీ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రిజర్వేషన్లపై సీఎం ఏక్‌నాథ్ షిండే నేతృత్వంలోని సర్కార్ ఒక డ్రాఫ్ట్ నోటిఫికేషన్ జారీ చేసింది. అయితే దీనిపై కూటమిలోని నాయకులు రకరకాలుగా మాట్లాడటం మరాఠా నేతల్ని ఆందోళనకు గురి చేసింది.

కాంగ్రెస్ కంటే బీజేపీకి విరాళాలు ఎక్కువ

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 10: 2022-23 ఆర్థిక సంవత్సరంలో కేంద్రంలోని అధికార బీజేపీకి ఎలక్టోరల్ బాండ్ల రూపంలో దాదాపు రూ.1,300 కోట్ల విరాళాలు వచ్చాయి. ఇది కాంగ్రెస్‌కు వచ్చిన విరాళాలు రూ.171 కోట్ల కంటే ఏడు రెట్లు అధికం. 2022-23లో మొత్తంగా బీజేపీకి రూ.2,120 కోట్ల విరాళాలు రాగా, అందులో ఎలక్టోరల్ బాండ్లవి 61 శాతంగా ఉన్నాయి. బీజేపీ తన వార్షిక ఆడిట్ నివేదికలో దీనిని వెల్లడించింది.

ఇండియా కూటమికి దెబ్బ మీద దెబ్బ

- పంజాబ్‌లో ఒంటరిపోరన్న కేజ్రీవాల్
- ప్రశ్నార్థకంగా మారిన కూటమి ఉనికి!

న్యూఢిల్లీ: ప్రతిపక్ష ఇండియా కూటమికి దెబ్బ మీద దెబ్బ తగులుతున్నది. ఈ కూటమిలో భాగస్వామిగా ఉన్న పశ్చిమ బెంగాల్‌లోని అధికార తృణమూల్ కాంగ్రెస్ లోక్‌సభ ఎన్నికల్లో ఒంటరిగానే పోటీ చేస్తామని ఇప్పటికే ప్రకటించగా.. బీహార్‌లోని అధికార జేడీయూ అధ్యక్షుడు నితీశ్‌కుమార్ బీజేపీతో చేతులు కలిపిన విషయం తెలిసిందే. అయితే తాజాగా కూటమిలోని మరో భాగస్వామి అయిన ఆమ్ ఆద్మీ పార్టీ కూడా పంజాబ్‌లో తాము ఒంటరిగానే పోటీ చేస్తామని ప్రకటించింది. శనివారం ఆ పార్టీ జాతీయ కన్వీనర్, ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ మాట్లాడుతూ పంజాబ్‌లోని 13 సీట్లు, చండీగఢ్‌లోని ఒక స్థానం కలిపి మొత్తం 14 స్థానాల్లో ఒంటరిగానే పోటీ చేస్తామని వెల్లడించారు. అలాగే ఉత్తరప్రదేశ్‌లోని రాష్ట్రీయ లోక్‌దళ్ పార్టీ అధ్యక్షుడు జయంత్ చౌదరి కూడా అధికార ఎన్డీయేతో పొత్తు కాదనలేనని చెప్పారు. తన తాతకు భారతరత్న ప్రకటించిన నేపథ్యంలో ఎన్డీయేలో చేరడానికి సుముఖతను వ్యక్తం చేశారు. అయితే తాము ఇప్పటికీ ఇండియా కూటమితోనే ఉన్నామని ఆప్ తెలిపింది. తమందరి ఉమ్మడి లక్ష్యం బీజేపీని ఓడించడమని చెప్పింది.

అతి పెద్ద పక్షంగా షరీఫ్ పార్టీ

కీలకంగా ఇమ్రాన్ మద్దతుదారులు.. పాక్‌లో పూర్తికాని ఎన్నికల కౌంటింగ్

షరీఫ్

ఇస్లామాబాద్: ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయిన పాకిస్తాన్‌కు ఇప్పుడు మరో కష్టమొచ్చిపడింది. గురువారం జరిగిన ఎన్నికల్లో ప్రజలు ఏ పార్టీకి స్పష్టమైన మెజార్టీని కట్టబెట్టలేదు. కౌంటింగ్ ఇంకా కొనసాగుతూ ఉంది. ఇప్పటి వరకు ఇమ్రాన్‌కు చెందిన పీటీఐ పార్టీ మద్దతుదారులు 99 సీట్లతో అగ్రస్థానంలో ఉన్నారు. కానీ పార్టీ పరంగా పాకిస్థాన్ ముస్లిం లీగ్-నవాజ్ పార్టీ 71 సీట్లతో అగ్రస్థానంలో ఉంది. పాకిస్తాన్ పీపుల్స్ పార్టీ 53 స్థానాల్లోనూ, ముత్తాహిదా క్వామి మూవ్‌మెంట్ 17 స్థానాల్లోనూ, మిగిలిన స్థానాల్లో చిన్న చిన్న పార్టీలు గెలుపొందాయి. పీటీఐ మద్దతుతో గెలిచిన స్వతంత్ర అభ్యర్థులు ఏ పార్టీలోనైనా చేరే అవకాశమున్నది. మరోసారి ప్రధాని కావాలని పీఎంఎల్-ఎన్ చీఫ్ నవాజ్ షరీఫ్ గట్టి ప్రయత్నాలు చేస్తున్నారు. మాజీ అధ్యక్షుడు అసిఫ్ అలీ జర్దారి తన చిన్న కొడుకు, పార్టీ అధినేత అయిన బిలావల్ భుట్టో జర్దారిని ప్రధాని అభ్యర్థిగా ప్రకటించాడు. ఏ పార్టీలో చేరాలనే విషయమై పీటీఐ నాయకత్వం అంతర్గతంగా సంప్రదింపులు ప్రారంభించింది.

ఎన్డీయేలోకి మరిన్ని పార్టీలు

మొదటిపేజీ తరువాయి...

మిత్రులు వస్తారన్నారు. 'కుటుంబాలకే ఫ్యామిలీ ప్లానింగ్. దాన్నే మేం నమ్ముతాం. కానీ రాజకీయ కూటమిలో ఫ్యామిలీ ప్లానింగ్ కుదరదు. కూటమిలో ఎంతమంది సభ్యులుంటే అంత మంచిది. దాన్ని మేం స్వాగతిస్తాం. మా విధానాలు, సిద్ధాంతాలను నమ్మి వచ్చిన పార్టీలతో జట్టు కట్టడానికి మేమెప్పుడూ సిద్ధమే. ఎన్డీయే కూటమిలోని మిత్రులను మేమెప్పుడూ బయటకు పంపించలేదు. ఆయా రాష్ట్రాల్లో ఉన్న రాజకీయ సమీకరణాలను దృష్టిలో ఉంచుకొని వాళ్లే బయటకు వెళ్లి ఉండొచ్చు. రాజకీయ పొత్తులు కొన్నిసార్లు స్థానిక పరిస్థితులు, రాజకీయ పరిస్థితులు బట్టి ఉంటాయి. మా సిద్ధాంతాలను సమర్థించే వారితో జట్టు కడతాం' అన్నారు.

అకాలీదళ్‌తో చర్చలు జరుగుతున్నాయి

'రాజకీయ పార్టీలు కూటమిలోకి వస్తాయి. పోతాయి. ఘట్‌బంధన్‌లో భాగంగా మేం వేరే పార్టీలతో పొత్తు పెట్టుకొన్నప్పుడు.. బీజేపీకి కొన్ని చోట్ల పూర్తి మెజారిటీ ఉన్నప్పటికీ, పొత్తు ధర్మం ప్రకారం.. చిన్న పార్టీలకు ముఖ్యమంత్రి పదవిని కూడా కట్టబెట్టాం' అని అమిత్ షా చెప్పారు. పంజాబ్‌లో కాంగ్రెస్, ఆప్‌ను ఎదుర్కోవడానికి పాత మిత్రులు అకాలీదళ్ నేతలతో చర్చలు జరుపుతున్నారు కదా! అన్న ప్రశ్నకు అమిత్ షా స్పందిస్తూ.. ఇంకా చర్చలు జరుగుతున్నాయని, తుది దశకు చేరుకోలేదని బదులిచ్చారు. ఇక, ఆంధ్రప్రదేశ్‌లోని పొత్తులపై అడిగిన ప్రశ్నపై స్పందిస్తూ.. ఈ విషయంపై సభావేదిక మీద ఇప్పుడే తానేమీ చెప్పలేనని ఆ అంశాన్ని దాటవేశారు.

మూడోసారి బీజేపీదే అధికారం

ఎన్డీఏ కూటమి మూడోసారి అధికారంలోకి వస్తుందని అమిత్ షా ధీమా వ్యక్తం చేశారు. రానున్న లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ 370 సీట్లు గెలుచుకుంటుందని, మొత్తంగా ఎన్డీయే కూటమి 400కు పైగా స్థానాల్లో విజయం సాధిస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు. దీంట్లో ఎలాంటి సందేహం లేదన్నారు. ప్రతిపక్షంలోనే మళ్లీ కూర్చోబోతున్నామని విపక్ష పార్టీలకు ఇప్పటికే అర్థమయినట్టు ఎద్దేవా చేశారు. 'కశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తిని ఇచ్చే ఆర్టికల్ 370ని మేము రద్దు చేశాం. రానున్న ఎన్నికల్లో దేశ ప్రజలు బీజేపీకి 370 సీట్లు, మొత్తంగా ఎన్డీయేకు 400కి పైగా సీట్లు ఇచ్చి ఆశీర్వదిస్తారని నమ్ముతున్నాను' అని అమిత్ షా వ్యాఖ్యానించారు. లోక్‌సభ ఎన్నికలకు ముందే పౌరసత్వ సవరణ చట్టాన్ని (సీఏఏ) అమలు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నామని కూడా తెలిపారు. సీఏఏపై ముస్లిం సోదరులను ఉద్దేశపూర్వకంగా తప్పుదోవ పట్టించి ఎగదోస్తున్నారని షా మండిపడ్డారు. పాకిస్థాన్, అఫ్ఘనిస్థాన్, బంగ్లాదేశ్ వంటి దేశాల్లో హింసను భరించలేక వచ్చిన వారికి పౌరసత్వం ఇవ్వడానికే సీఏఏ తీసుకొచ్చినట్టు తెలిపారు. ఎవరి పౌరసత్వాన్ని కూడా తొలగించబోమన్నారు.

రాహుల్‌కు ఆ అర్హత లేదు

కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ నేతృత్వంలో జరుగుతున్న భారత్ జోడో న్యాయ్ యాత్ర గురించి అడిగిన ప్రశ్నలపై కూడా ఈ సందర్భంగా అమిత్ షా స్పందించారు. 1947లో దేశ విభజనకు కారణమైన కాంగ్రెస్ పార్టీకి చెందిన రాహుల్‌కు ఈ తరహా యాత్రతో ముందుకు వెళ్లే అర్హత లేదని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన శ్వేతపత్రం గురించి మాట్లాడుతూ.. '2014లో భారత ఆర్థిక వ్యవస్థ ఒడిదుడుకుల్లో ఉన్నది. ఎక్కడచూసినా కుంభకోణాలే. విదేశీ పెట్టుబడులు కరువయ్యాయి. ఇలాంటి క్లిష్ట పరిస్థితుల్లో అప్పుడు శ్వేతపత్రం తెచ్చి ఉంటే.. ప్రపంచానికి తప్పుడు సందేశం వెళ్లేది. ఈ పదేండ్లలో ఆర్థిక వ్యవస్థను గాడిన పెట్టాం. అవినీతి లేదు. విదేశీ పెట్టుబడులు భారీగా వచ్చాయి. అందుకే శ్వేత పత్రాన్ని తీసుకురావడానికి ఇదే సరైన తరుణం అని నమ్మాం. తీసుకొచ్చాం' అని తెలిపారు. రాముడు జన్మించిన ప్రాంతంలో రామమందిరాన్ని నిర్మిస్తారని దేశ ప్రజలు 500-550 ఏండ్లపాటు నమ్మారని, బుజ్జగింపు రాజకీయాల కారణంగా ఆ కల ఆలస్యమైనప్పటికీ, ఎట్టకేలకు సాకారం అయిందని పేర్కొన్నారు. ప్రధాని మోదీ ఓబీసీ వివాదంపై స్పందించిన షా.. 1994లో గుజరాత్‌లో కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడే మోదీ కులం ఓబీసీగా రిజిస్టరైనట్టు పేర్కొన్నారు. అప్పటికి మోదీ ఏ ఒక్క ఎన్నికల్లో పోటీ పడలేదని గుర్తుచేశారు. ప్రధాని కులంపై చర్చ దురదృష్టకరమన్న షా.. రాహుల్ గాంధీకి బహిరంగంగా అబద్ధాలు చెప్పడం అలవాటుగా మారిందని మండిపడ్డారు.

శనివారం అయోధ్య రాముడి దర్శనానికి భారీగా వచ్చిన భక్తులు

రామాలయంతో సాంస్కృతిక పునరుజ్జీవనం

- నవ భారత నిర్మాణానికి జనవరి 22న నాంది
- రామాయణం నుంచి మన సంస్కృతిని వీడబీయలేం
- లోక్‌సభలో అయోధ్య ఆలయం తీర్మాన చర్చలో అమిత్ షా

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 10: అయోధ్య రామ మందిరం సాంస్కృతిక పునరుజ్జీవనానికి చిహ్నంగా నిలుస్తుందని కేంద్ర మంత్రి అమిత్ షా చెప్పారు. శనివారం లోక్‌సభలో అయోధ్య రామ మందిరంపై జరిగిన చర్చలో ఆయన మాట్లాడుతూ నవ భారత నిర్మాణానికి జనవరి 22 నాంది పలికినట్టు చెప్పారు. అయోధ్య రామమందిర తీర్మానం భవిష్యత్తు తరాలకు దేశ విలువలపై గర్వపడేలా రాజ్యాంగపరమైన స్థైర్యాన్ని ఇస్తుందని ప్రధాని మోదీ అన్నారు.

హిందూత్వం కోసమే మోదీ ప్రభుత్వం ఉందా: ఒవైసీ

మోదీ ప్రభుత్వం కేవలం హిందూత్వ కోసమే ఉందా? అని హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ ప్రశ్నించారు. బాబ్రీ మసీదు అది కట్టిన స్థలంలోనే ఉంటుందని ఆయన అన్నారు. అయోధ్య రామాలయ చర్చలో ఆయన మాట్లాడుతూ బాబ్రీ మసీదు జిందాబాద్.. భారత్ జిందాబాద్ అంటూ నినాదాలు చేశారు. బాబ్రీ మసీదు కూల్చివేతకు కారకులైన ఇద్దరికి ప్రభుత్వం భారతరత్నలు ప్రకటించిందని ఆయన విమర్శించారు. 1992 డిసెంబర్ 6న జరిగిన బాబ్రీ మసీదు కూల్చివేతను పార్లమెంట్ ఖండించిందని గుర్తు చేశారు. మోదీ ప్రభుత్వం కేవలం హిందూవులకేనా లేదా యావత్ దేశానికా అని ఆయన ప్రశ్నించారు. దేశంలోని 17 కోట్ల మంది ముస్లింలు పరాయీకరణ భావంతో ఉన్నారని, ఈ దేశానికి 'బాబా మోదీ' అవసరం లేదని అన్నారు.

పార్లమెంట్ నిరవధిక వాయిదా

పార్లమెంట్ ఉభయ సభలు నిరవధికంగా వాయిదా పడ్డాయి. 17వ లోక్‌సభ శనివారం తన ఆఖరి సమావేశాన్ని ముగించింది. ఈ లోక్‌సభలో మొత్తం 222 బిల్లులు ఆమోదించినట్టు స్పీకర్ ఓం బిర్లా ప్రకటించారు.

ఆపరేషన్ థియేటర్‌లో ప్రీ వెడ్డింగ్ ఫొటోషూట్

బెంగళూరు: నేటి వివాహ వ్యవస్థలో విస్తృతంగా నడుస్తున్న ట్రెండ్.. ప్రీ వెడ్డింగ్ ఫొటోషూట్. ఇది రానురాను కొత్త పుంతలు తొక్కుతున్నది. చిత్ర విచిత్రాలుగా ఫొటోషూట్స్ తీస్తున్నారు. తాజాగా కర్ణాటకలో ఒక వైద్యుడు ఆపరేషన్ థియేటర్‌లో తన కాబోయే భార్యతో కలిసి ఒక రోగికి శస్త్ర చికిత్స చేస్తున్నట్టుగా నటిస్తూ ప్రీ వెడ్డింగ్ ఫొటోషూట్ చేశారు. చిత్రదుర్గ జిల్లాలోని బరమసాగర్ ప్రభుత్వ దవాఖానలో ఈ ఘటన జరిగింది. ఇందుకు బాధ్యుడైన కాంట్రాక్ట్ వైద్యుడు అభిషేక్‌ను ఉన్నతాధికారులు సస్పెండ్ చేశారు. ఆపరేషన్ థియేటర్‌లో చిత్రీకరించిన ఈ ఫొటోషూట్‌కు సంబంధించిన వీడియోను వారు సోషల్ మీడియాలో పోస్టు చేయడంతో.. అది వైరల్‌గా మారింది. డాక్టర్ అభిషేక్‌ను విధుల నుంచి తొలగించాలని రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి దినేష్